

చల్లపల్లి గురుకుల బాలికల కళాశాల నుంచి తల్లిదండ్రులతో కలిసి ఇళ్లకు వెళ్తున్న బాలికలు



అప్రమత్తం!

మొంథా తుఫాను హెచ్చరికలు జారీ

తీవ్ర తుఫానుగా మారే అవకాశం

- 28న మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తీరం దాటనున్న తుఫాను
- రంగంలోకి దిగిన అధికార యంత్రాంగం
- జిల్లాలోని 25 మండలాలకు ప్రత్యేక అధికారుల నియామకం
- మంగినపూడి బీచ్‌లో పర్యటించిన కలెక్టర్ బాలాజీ
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశానిర్దేశం
- ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేలా ఏర్పాట్లు
- జిల్లా ప్రత్యేక అధికారిగా అమ్రపాలి నియామకం

మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ బాలాజీ మంగినపూడి బీచ్‌లో పర్యటించారు. సముద్రాన్ని పరిశీలించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా ఎదుర్కొనేలా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లాలోని 25 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. వీరు మండల కేంద్రాల్లో ఉండి పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేశారు. జిల్లాలోని పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా అమ్రపాలిని ప్రభుత్వం నియమించింది.


ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం సోమవారం నాటికి తుఫానుగా మారుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం నాటికి తీవ్ర తుఫానుగా మారి, రాత్రి సమయంలో మచిలీపట్నం-కళింగపట్నం మధ్య తీరం దాటుతుందని స్పష్టం చేసింది. తుఫాను ప్రభావంతో సోమ, మంగళ, బుధవారాల్లో కోస్తాతీరం వెంబడి అతి భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను ప్రకటించింది. తుఫాను ప్రభావంతో తీరం వెంబడి సోమవారం గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో, 28వ తేదీన 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వాతావరణశాఖ తెలిపింది.



మంగినపూడి బీచ్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుఫాను ప్రభావంతో జిల్లాలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికపుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో 0867 252572 నెంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో 08672 252486 నెంబరుతో, గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో 08674 243693 నెంబరుతో, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయంలో 08676 232589 నెంబరుతో కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయి. వీటితో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికపుడు తుఫాను కారణంగా సంభవించే పరిస్థితులను తెలుసుకోనున్నారు.



తుఫాను గమనాన్ని సూచిస్తూ వాతావరణశాఖ విడుదల చేసిన చిత్రం

మంగినపూడి బీచ్‌లో కలెక్టర్ పర్యటన

కలెక్టర్ బాలాజీ ఆదివారం మంగినపూడి బీచ్‌లో పర్యటించారు. సముద్రపు అలల ఉధృతిని పరిశీలించారు. మత్స్యకారులు చేపల వేట నిమిత్తం సముద్రంలోకి వెళ్లకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్వాతి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఏ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను, వరదల మధ్య తేడాను గ్రహించాలన్నారు. తుఫాను ప్రభావం జిల్లా అంతటా ఉంటుందని, అన్ని ప్రాంతాల్లో భారీ వర్షం, పెనుగాలులు వీస్తాయన్నారు. తుఫాను

మిగతా 6లో..

లక్ష దీపార్చన



గుడ్లవల్లేరులోని గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం లక్ష దీపార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో దీపాలను వెలిగించారు. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న దీపాలను చూసి తన్మయత్వం చెందారు. -ఆంధ్రజ్యోతి-గుడ్లవల్లేరు

మహిమాన్వితుడు.. చిలకలపూడి పాండురంగడు



- 31 నుంచి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- నవంబరు 2న రథోత్సవం
- హాజరుకానున్న మంత్రి కొల్లు రవీంద్ర

సుబ్బారాయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

6

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు మహిళల ఫిర్యాదు



నిర్ణయమెప్పుడు?

రబీ సీజన్‌లో సాగునీటి విడుదలపై ఆశలు

- జిల్లాలో 50 వేల హెక్టార్లలో వరి సాగుకు అవకాశం
- ఐఏబీ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి
- ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు రాని స్పష్టత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఈ ఏడాది రబీ సీజన్‌లో కృష్ణాడెల్టాకు వరి సాగు నిమిత్తం నీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుంటుందని రైతులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగుస్తుంది. నవంబరు మొదటి వారం నుంచి ఎగువ ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమవుతాయి. ఈలోగానే రబీ సీజన్‌లో వరి సాగుకు నీటిని విడుదలచేసే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రకటన చేస్తేనే ఏ రకం వరి వంగడాలు సాగు చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. రబీ సీజన్‌లో వరి సాగు చేసి కొంతమేర ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే విజ్ఞప్తిని పట్టించుకుంటారా!

జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన ఈ నెల 13వ తేదీన జెడ్పీ సమావేశపుహాలులో జరిగింది. ఈ సమావేశంలో సముద్ర తీర మండలాల రైతులు దాళ్వా పంటకు సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారని, సాగు నీటిని విడుదల చేస్తారా, కాల్వలను బాగుచేస్తారా అని జలవనరుల శాఖ అధికారులను ఎంపీ ప్రశ్నించారు. రైతులకు మేలు చేసే నిర్ణయం తీసుకోవాలని కోరారు. రబీకి నీటిని విడుదల చేయాలని ఈ నెల 22వ తేదీన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పెడన నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఎంపీ బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత

మిగతా 6లో..



రబీ సీజన్‌లో 1.20 లక్షల హెక్టార్లలో పంటల సాగు

జిల్లాలో రబీ సీజన్‌లో 1.20 లక్షల హెక్టార్లలో మినుము, మొక్కజొన్న, పెసలు తదితర పంటలు రైతులు సాగు చేస్తారు. సముద్ర తీరంలోని కోడూరు, నాగాయలంక, మచిలీపట్నం, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు, పామర్రు మండలాల్లో రబీ సీజన్‌లో మినుము పంట పండే అవకాశం లేకపోవడంతో 50 వేల హెక్టార్లలో వరిపంటను సాగు చేస్తారు. సాగునీటి విడుదలను బట్టి వరి సాగు చేసే విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది. గన్నవరం, కంకిపాడు, ఉయ్యూరు తదితర మండలాల్లో కాల్వలకు సాగునీటిని విడుదల చేయకున్నా, బోరునీటి ఆధారంగా రబీ సీజన్‌లో వరి పంటను సాగు చేస్తారు. సాగు నీటిని విడుదల చేస్తే పంటలకు ఉపయోగించుకుంటారు. రబీలో వరి సాగుకు అనుమతులు ఇస్తే, అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగానే ప్రణాళికను తయారు చేసుకోవాల్సి ఉంది.

ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఆదివారం రాత్రి ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు



ప్రైవేటు బస్సులపై కొరడా!

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50 బస్సులపై కేసులు నమోదు
- ఐదు బస్సులు సీజ్.. గత శనివారం నుంచి విస్తృతంగా తనిఖీలు
- వివరాలు వెల్లడించిన రవాణాశాఖ అధికారులు

విజయవాడ సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రైవేటు బస్సు దగ్ధమైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో రవాణాశాఖ కొరడా ఝుళిపించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో గత శనివారం రాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఈ వివరాలను రెండు జిల్లాల రవాణా శాఖ అధికారులు ఆదివారం వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లాలో 42 బస్సులపై కేసులు నమోదు చేశారు. రవాణా చట్టాన్ని ఉల్లంఘించి అనధికారికంగా నడుస్తున్న ఒక బస్సును సీజ్ చేసినట్లు ధ్రువీకరించారు. కృష్ణాజిల్లాలో ఎనిమిది బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో అనధికారికంగా నడుస్తున్న నాలుగు బస్సులను సీజ్ చేశారు. రవాణా చట్టం ప్రకారం సరైన ధ్రువీకరణ పత్రాలు లేని, అధిక సీటింగ్ ఉన్న బస్సులపై కేసులు నమోదు చేశారు.

శివతాండవం!

విజిలెన్స్ కానిస్టేబుల్ రూటే సపరేటు



- అడ్డగోలు వ్యవహారాల్లో తెరవెనుక పాత్ర
- ఉన్నతాధికారుల పేషీలోని అధికారులతో సంబంధాలు
- వారి ద్వారా పలువురి బదిలీలకు సిఫార్సులు
- కమిషనరేట్ నుంచి విజిలెన్స్‌కు వెళ్లిన సదరు కానిస్టేబుల్
- కమిషనరేట్‌లో మూడుసార్లు వీఆర్‌కు పంపిన అధికారులు
- పీడీఎస్, బెట్టింగ్, ఇసుక మాఫియాతో సత్సంబంధాలు!

ఆయన ఐపీఎస్ అధికారి కాదు. అలాగని డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అంత కన్నా కాదు. సబ్‌ఇన్‌స్పెక్టర్ వద్ద పనిచేసే కానిస్టేబుల్. ఉద్యోగం కానిస్టేబుల్ స్థాయి అయినా వ్యవహారాలు మాత్రం ఐపీఎస్ స్థాయిలో ఉంటాయి. ఎవరిని పట్టుకుంటే ఏ పని సులువుగా అవుతుందో కనికట్టు తెలిసిన మహా ముదురు. ఇప్పుడు ఈ కానిస్టేబుల్ పేరు అటు విజిలెన్స్‌లోను, ఇటు డీజీపీ కార్యాలయంలోను చర్చనీయాంశమవుతోంది. ఐపీఎస్ స్థాయి అధికారులతో సంబంధాలు లేకుండా వారి పేషీల్లో పనిచేసే అధికారులతో సత్సంబంధాలు నడుపుతూ కాగల కార్యాలను పూర్తి చేయించుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి- విజయవాడ): వైసీపీ హయాంలో విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేశాడు. ఇక్కడ కీలకమైన నిఘా విభాగంలో పనిచేస్తూ అక్రమ వ్యాపారులు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారితో మంచి సంబంధాలు పెట్టుకున్నాడు. ఇక్కడ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండానే మొత్తం వ్యవహారాలను చక్కబెట్టేవాడు. ఇక్కడ పనిచేసినంత కాలం పీడీఎస్‌ను అక్రమంగా తరలించే ముఠాలు, బెట్టింగ్‌ను జోరుగా నిర్వహించే ముఠాలతో మంచి స్నేహబంధాలను కొనసాగించాడు. ఈ వ్యవహారాలు ఉన్నతాధికారులకు తెలియడంతో అతడిని మూడు సార్లు వీఆర్‌కు పంపారు. తర్వాత అప్పటి రాజకీయ నేతలు, ఉన్నతాధికారులను ఉపయోగించుకుని తిరిగి అదే కీలకమైన విభాగంలో పోస్టింగ్ సంపాదించుకుని చెలరేగిపోయాడు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది సమయం ఉందనగా ఇక్కడి నుంచి తెలివిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యాడు. అక్కడే ముఖ్యఅధికారి పేషీ వద్ద విధులను కుదుర్చుకున్నాడు. అక్కడ నుంచి మళ్లీ చక్రం తిప్పడం మొదలుపెట్టాడు. పీడీఎస్ అక్రమ రవాణా, బెట్టింగ్ ముఠాలకు తాను ఉన్నానంటూ అభయహస్తం ఇచ్చాడు. కల్తీ వ్యాపారాలు చేసే ముఠాలతో నిత్యం సంప్రదింపులు చేస్తున్నాడని వ్యాపార వర్గాలు బహిరంగంగా చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎలాంటి వే బిల్లులు, రశీదులు లేకుండా రాకపోకలు సాగించే వాహనాలకు నగరం దాటే వరకు ప్రత్యేకంగా ఎస్కార్ట్‌ను ఇప్పిస్తున్నట్టు వినికిడి.

బాగోతం ఇలా బయట పడింది..

విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఈ కానిస్టేబుల్ డీజీపీ కార్యాలయంలోని ఉన్నతాధికారుల పేషీల్లో ఉండే అధికారులకు దగ్గరయ్యాడు. వారు చెప్పిన పనులు చేసిపెట్టి వారికి నమ్మినబంటుగా మారిపోయాడు. దీంతో ఇతడు చెప్పిన పనులు చేయించుకోవడం మొదలుపెట్టాడు. వివిధ జిల్లాల్లో ఉన్న ఐపీఎస్ అధికారులకు ఈ పేషీ అధికారులతో ఫోన్లు చేయించి తనకు కావాల్సిన వారికి అనుకూలంగా ఉన్న విభాగాల్లో పోస్టింగ్‌లు ఇప్పించుకున్నాడు. ఈ తతంగం గుంటూరు జిల్లా నుంచి

మిగతా 6లో..

బుడమేరుకు యాక్షన్ ప్లాన్ అవసరం!

గతేడాది బుడమేరు కాల్వకు ఏర్పడిన గండిని పూడుస్తున్న అధికారులు (ఫైల్)



ఎన్టీఆర్ జిల్లాలో మొంథా ప్రభావం

- వాయువ్య ప్రాంతాల్లో వర్షాలు..!
- 15 వేల క్యూసెక్కుల వరద వరకు ఇబ్బంది లేదు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తుఫాను ప్రభావంతో విజయవాడతో పాటు వాయువ్య ఎన్టీఆర్ జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం బుడమేరు యాక్షన్ ప్లాన్‌కు సంసిద్ధం కావాల్సిన అవసరం ఉంది. గతేడాది సెప్టెంబరులో కేవలం రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకే బుడమేరు మహోగ్రరూపం దాల్చింది. మొంథా తుఫాను వల్ల మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్న నేపథ్యంలో బుడమేరుకు వరద వచ్చే అవకాశం ఉంది. వాయువ్య ఎన్టీఆర్ జిల్లాలో గంపలగూడెం, తిరువూరు, ఏ.కొండూరు, మైలవరం, జి.కొండూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో భారీ వర్షం కురిస్తే బుడమేరు ఉప్పొంగుతుంది.

బుడమేరు అనేది అనేక వాగుల సమాహారం. ఏ.కొండూరు మండలం జమ్మలోయిదుర్గం దగ్గర బుడమేరు ప్రారంభమవుతుంది. ఇలా మొదలైన బుడమేరుకు వెలగలేరు వరకు ఎన్నో భారీ వాగులు కలుస్తాయి. చీమలపాడు దగ్గర పాలవాగు, రెడ్డిగూడెం నుంచి కోతులవాగు, మెర్సుమిల్లి, అనంతవరం, మైలవరం నుంచి కొండవాగులు, కుంటముక్కల కొండవాగు, కొండపల్లి రిజర్వు ఫారెస్టు నుంచి పులివాగు, కప్పల వాగు, తొమ్మండ్రువాగులు అన్నీ ఉధృతంగా ప్రవహించి బుడమేరులో కలుస్తాయి. కాబట్టి ఈ వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం అంచనా వేస్తుండాలి. కృష్ణానదికి వచ్చే వరద మాదిరిగా బుడమేరుకు ఎన్ని క్యూసెక్కుల వరద వస్తుందనేది.. వచ్చే వరకు కూడా తెలియదు. బుడమేరును అంచనా

మిగతా 6లో..

ప్రకృతి ఒడిలో పరుగు



రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు





అడవి మధ్యలో సాగుతున్న రన్



మూలపాడులో ట్రైమెట్రిక్స్ హ్యాపీ ఫారెస్ట్ రన్

ప్రకృతి ప్రేమికులతో ఆహ్లాదకర వాతావరణంలో కొండ కోనల సవ్వడులను ఆస్వాదిస్తూ.. పక్షుల కిలకిలరావాలు.. సీతా కోకచిలుకల సోయగాల మధ్య మధురానుభూతిని అనుభవించాలనుకునే ప్రకృతి ప్రేమికుల హ్యాపీ ఫారెస్ట్ రన్ అద్భుతంగా సాగింది. పర్యాటకులకు ప్రకృతి మధురానుభూతులను పంచేందుకు 'ట్రైమెట్రిక్స్' సంస్థ మూలపాడు వద్ద నిర్వహించిన ఈ ట్రయల్ రన్ ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు కొండ కోనల్లో ఆదివారం జరిగింది. అటవీ శాఖ అధికారుల సహకారంతో రేస్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో 'ట్రైమెట్రిక్స్' హెడ్ కోచ్ బి.రుషిల్ యాత్రను నిర్వహించారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)





ఫారెస్ట్ రన్‌లో చిన్నారులు

మహిమాన్వితుడు.. చిలకలపూడి పాండురంగడు



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర కీరపండరీపురం పాండురంగనికి ఎంత ప్రాశస్త్యం ఉందో.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మచిలీపట్నం చిలకలపూడిలోని పాండురంగ స్వామికి అంత ప్రాశస్త్యం ఉంది. రంగా అని పిలిస్తే పలికే దైవంగా, భక్తుల కొంగుబంగారంగా పాండురంగస్వామి 1929 నవంబరు 13న కార్తీకశుద్ధ ఏకాదశి నాడు స్వయంభువుగా వెలిశారు. ఆరున్నర ఎకరాల సువిశాల ప్రాంగణంలో 1958లో దేవాలయాన్ని నిర్మించారు. ఆలయంలో 108 మంది విష్ణుభక్తులు రాధా రుక్మిణి, సత్యభామ, అష్టలక్ష్ముల ఆలయం, సహస్రలింగ కైలాశ మండపం, షిరిడి సాయి మందిరం, సిద్ధేశ్వర స్వామి ఆలయం నిర్మించారు. కాగా 400 ఏళ్ల నాటి అశ్వర్థ వృక్షం ఇక్కడ కనబడుతుంది. అప్పట్లో మునులు ఈ వృక్షం కింద తపస్సు చేశారని ప్రతీతి. కీరపండరీపురం నుంచి చిలకలపూడికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు.

31 నుంచి ఉత్సవాలు

ఈనెల 31 నుంచి పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 31వ తేదీ గోపూజ, లక్ష్మీగణపతి హోమం, గురుపూజ, పల్లకీ ఉత్సవాలు జరుగుతాయి. నవంబరు 1న ఉదయం సత్యనారాయణ స్వామి వ్రతాలు, రాత్రి రుక్మిణి సమేత పాండురంగ స్వామి కళ్యాణోత్సవం జరగనుంది. 2న ఉదయం నుంచి రాత్రి వరకు పాండురంగ స్వామి రథోత్సవం జరుగుతుంది. 3న సహస్ర లింగేశ్వర స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, విష్ణుసహస్ర నామ పారాయణలు, 4న రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజలు, లలితా సహస్ర నామ పారాయణలు, రాత్రి సహస్ర దీపారాధనలు, కోలాటం, పండరీ భజనలు జరుగుతాయి. 5న పూర్ణిమ సందర్భంగా పల్లకీ ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు చలమలశెట్టి నరసింహారావు తదితరులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో పాటు బీజేపీ నాయకులు రథం ఊరేగింపులో పాల్గొననున్నారు.



తాగునీటికోసం స్టీలు బాటిల్స్‌తో స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు

పర్యావరణ హితంగా.. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల విహార యాత్ర

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారి వాడిపారేసే ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పర్యావరణ హిత పద్ధతులను అవలంబిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు ఊటీ యాత్రను పర్యావరణ హితంగా పూర్తిచేశారు. రథసారథులు డాక్టర్లు డీఆర్కే ప్రసాద్, పద్మావతి దంపతులు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారితోపాటు 26 మంది స్వచ్ఛ కార్యకర్తల బృందం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులేమీ వాడకుండా యాత్ర పూర్తిచేశారు. ఊటీ యాత్ర ముగించుకుని ఆదివారం చల్లపల్లి తిరిగివచ్చారు. రైలులో ఆహారం తినేందుకు, నీరు తాగేందుకు స్టీలు వస్తువులు ఉపయోగించారు. పదేళ్లుగా తమ విహార యాత్రలన్నీ పర్యావరణ హితంగానే చేశామనీ, ఊటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నారని స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ ప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని స్థానిక సంస్థలు అమలుచేయాలన్నారు.



స్వామి దర్శనం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

సుబ్బారాయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మోపిదేవి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయం భక్తులతో కిటకిటలాడింది. నాగపంచమి, ఆదివారం ప్రత్యేకత కావటంతో పలుప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేలాదిగా వచ్చిన భక్తులు ప్రధాన రహదారి వెంబడి బారులు తీరారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



శ్రావణి కంటి ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

గోసాలలో శ్రావణి కంటి ఆసుపత్రి ప్రారంభం

పెనమలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోసాలలో ఇటీవల నిర్మించిన శ్రావణి కంటి ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానికులకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ శ్రావణిలు మాట్లాడుతూ, ఆసుపత్రిలో కంటి, రెటీనాల చికిత్సకు ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, క్యాటరాక్ట్ సర్జరీలు, రెటీనా కేర్ చికిత్సలు, అడ్వాన్స్‌డ్ లేజర్ చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మొంథా దూసుకొస్తోంది.. అప్రమత్తం కండి

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులపాటు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆదివారం చల్లపల్లి వచ్చిన ఆయన సబ్‌స్టేషన్‌ను పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, మెటీరియల్, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో తుఫాన్ జాగ్రత్తలపై సమీక్షించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని సెల్‌టవర్‌ను పరిశీలించి, సెల్ సిగ్నల్స్ నిరంతరాయంగా కొనసాగాలనీ, సిగ్నల్స్ ఆగకుండా చూసుకోవాలనీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని టెక్నీషియన్‌కు సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు సెల్ టవర్‌లకు ఆయిల్ వినియోగం ఎంత అవుతుందని ప్రశ్నించిన కలెక్టర్, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ, గ్రామాల్లో పూరిళ్లలో నివసించే ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రోడ్డు వెంబడి గుడారాల్లో నివసించే ప్రజలు, శిథిల భవనాల్లో నివసించే వారిని సురక్షిత భవనాలకు చేర్చాల్సిందిగా ఆదేశించారు.



సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

నాగాయలంక : మొంథా తుఫాను తీరం దాటి ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు ఆదేశించారు. మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలు సూచించారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో కె.ఎం.చంద్రశేఖర్, మత్స్యశాఖ ఏడి ఆర్.ప్రతిభ, ఎస్సై కె.రాజేష్, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. మండలంలోని 15 తీర ప్రాంత గ్రామాల ప్రజలను 10 పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. అన్ని శాఖల అధికారులతో ఆయన తుఫాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు.



జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలిస్తున్న ప్రత్యేకాధికారి

తీసుకోవలసిన జాగ్రత్తలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతాల్లో తరచూ తుపానులను ప్రజలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అక్టోబరు, నవంబరు నెలల్లో తుపాన్లు వస్తూనే ఉన్నాయి. తుపాను సమయంలో సెల్‌ఫోన్లు, పవర్ బ్యాంకుల్లో పూర్తి స్థాయిలో ఛార్జింగ్ ఉంచుకోవాలి. కొవ్వొత్తులు అందుబాటులో ఉంచుకోవాలి. మోటారు బైక్‌ల్లో పెట్రోలు నింపుకోవాలి. పాలు, పెరుగు, బియ్యం, నూనె, కూరగాయలు కొనుక్కుని ముందస్తుగా కొనుక్కోవాలి. రోగులు మందులు అందుబాటులో ఉంచుకోవాలి. కొన్ని సందర్భాల్లో చెట్లు పడిపోయే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో కార్లు, బైక్‌లు ఉంచుకోవాలి. విద్యుత్ సరఫరా లేని సమయాల్లో దోమల బెడదను నివారించేందుకు ఓడోమాస్ వంటి క్రీములను అందుబాటులో ఉంచుకోవాలి. ఏ విధమైన ప్రమాదం సంభవించినా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలి. పెనుగాలులు వీచే సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్ళడం మంచిది కాదు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉండే భవనాల్లో నివసించడం మంచిది కాదు. పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

హంసలదీవికి తుఫాన్ హెచ్చరికలు

కోడూరు : మొంథా తుఫాన్ నేపథ్యంలో హంసలదీవి బీచ్‌కి పర్యాటకులు రావద్దని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీసాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హంసలదీవి బీచ్ వద్ద తుఫాన్ ప్రభావంతో అలలు ఎగసిపడుతున్నందున 27, 28, 29 తేదీల్లో మూడు రోజులపాటు పాలకాయితిప్ప హంసలదీవి బీచ్ గేట్లను మూసివేస్తున్నట్టు తెలిపారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది పటిష్ట సమన్వయంతో, ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఆదివారం ఆయన ఆర్డీవోలతో పాటు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పౌరసరఫరాలు, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణానదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో ప్రయాణాలు చేయకుండా అవగాహన కల్పించాలని, పశువులను చెట్లకింద, స్తంభాలతో కట్టకుండా చూడాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది 24/7 పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ఏ దైనా అత్యవసర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రానికి (9154970454) నివేదించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థలోని భవంతులను గుర్తించి అందులో ఎవరూ ఉండకుండా, పునరావాస శిబిరాలకు తరలించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్లకుండా ఆయా గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఒకవేళ చెట్లు, స్తంభాలు ఎక్కడైనా పడిపోతే వెంటనే తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విధుల నిర్వహణలో నిబద్ధత, నిరంతర అప్రమత్తతే ప్రజల భద్రతకు భరోసానిస్తుందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. టీసీలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కే మాధురి పాల్గొన్నారు.

అప్రమత్తం!

(5వ పేజీ తరువాయి)

తీరందాటిన తర్వాత కూడా ప్రభావం ఉంటుందని, భారీ వర్షాలు కురుస్తాయని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 29వ తేదీ వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. అక్కడ తాగునీరు, భోజన వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. బలమైన గాలుల తాకిడికి విద్యుత్ స్తంభాలు విరిగి పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండి ఈ పనులను పర్యవేక్షించాలన్నారు. గాలుల తీవ్రతకు రహదారుల వెంబడి చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. తుఫాను విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి తుఫాను విపత్తును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

జిల్లాకు రూ.కోటి నిధులు

మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన తక్షణ చర్యల కోసం ప్రభుత్వం కోటి రూపాయలను మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను తుఫాను సమయంలో అత్యవసర అవసరాల కోసం వినియోగించాలని సూచించింది. టీఆర్ 27 ఖాతా నుంచి ఈ నిధులను డ్రా చేసుకునే వెసులు బాటును కల్పించింది.

బుడమేరు యాక్షన్ ప్లాన్ అవసరం!

(5వ పేజీ తరువాయి)

వేయాలంటే పైన చెప్పుకున్న వాగులన్నింటినీ ఎప్పటికప్పుడు అంచనా వేస్తుండాలి. వాగుల ఉధృతిని బట్టి బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ)కి ఎంత వరద వస్తుందన్నది అంచనా వేయటం సాధ్యమవుతుంది. ఒక్కో వాగును ఒక్కో ప్రత్యేకాధికారి ద్వారా మానిటరింగ్ చేయించగలిగితే త్వరగా అంచనా వేయించటం ద్వారా రాబోతున్న ఉపద్రవాన్ని అర్థం చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. గతేడాది 45 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. వెలగలేరు దగ్గర బుడమేరు హెడ్‌రెగ్యులేటరీ కేవలం 15 వేల క్యూసెక్కుల వరదను మాత్రమే కృష్ణానదిలోకి డైవర్షన్ చేయగలదు. అంతకు మించి వరద వస్తే మాత్రం గేట్లు ఎత్తాల్సి ఉంటుంది.

నిర్ణయమెప్పుడు?

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తిని జలవనరులశాఖ అధికారులు, కలెక్టర్ ఎంతమేర పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై రైతులు చర్చించుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దాళ్వా పంటకు సాగునీటి విడుదలపై రైతుల వినతులను పట్టించుకోకుండానే సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ముగించారని, కూటమి ప్రభుత్వం అయినా దాళ్వాపంటకు సాగునీటిని విడుదల చేసే అంశంపై పూర్తిస్థాయిలో చర్చించి సముచిత నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న వరద

ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రకాశం బ్యారేజీ ద్వారా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తూనే ఉన్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న పులిచింతల, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను దృష్టిలో పెట్టుకుని కృష్ణాడెల్టా పరిధిలోని సముద్ర తీరంలోని మండలాలకు రబీ సీజన్‌లో సాగు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంపై త్వరితగతిన ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేస్తే నారుమడులు ముందస్తుగానే పోసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగుకు, వేసవిలో తీర ప్రాంతంలోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలకు సుమారుగా 40 టీఎంసీల నీరు సరిపోతుందని అంచనాగా ఉంది.

సాగు నీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకుంటేనే..

ఏటా నవంబరులో సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో ఏయే ప్రాంతాలకు రబీ సీజన్‌లో వరిసాగుకు అనుమతులు ఇవ్వాలి, సాగునీరు, తీర ప్రాంతంలో వేసవికాలంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎంతమేర నీటిని కాల్వలకు విడుదల చేయాలి, సాగు నీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తదితరాలను బేరీజు వేసుకుని అధికారులు, పాలకులు తగునిర్ణయం తీసుకుంటారు. ఈ సమావేశం నవంబరు ప్రారంభంలోనే నిర్వహిస్తే ఉపయోగం ఉంటుందని రైతులంటున్నారు. ఈ సమావేశం జరిగే తేదీని అధికారులు ఇంతవరకు ప్రకటించలేదు.

శివతాండవం!

(5వ పేజీ తరువాయి)

శ్రీకాకుళం జిల్లా వరకు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల విజయవాడలో క్రమశిక్షణ చర్యలు కింద బదిలీ అయిన కానిస్టేబుల్‌ను తిరిగి కీలకమైన విభాగంలో నియమించుకున్నాడు. డీజీపీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి పేషీలోని అధికారితో ఈ సిఫార్సు చేయించాడు. ఈ వ్యవహారం రచ్చకావడంతో ఆ పేషీ అధికారి మొత్తం చరిత్రను తెలుసుకున్నారు. అసలు విషయాలను తొక్కిపెట్టి తనతో సిఫార్సు చేయించుకున్నాడని ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. అప్పటి నుంచి తన పేషీలోకి అడుగుపెట్టవద్దని హెచ్చరించారు. సాధారణంగా విదేశాలకు వెళ్లినప్పుడు ఆ శాఖలోని ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. అటువంటి ఈ కానిస్టేబుల్ ఎలాంటి అనుమతులు లేకుండానే బ్యాంకాక్ ట్రిప్పులు పలుమార్లు వేశాడని అతడి స్నేహితులే చెబుతున్నారు. కమిషనరేట్‌లో మూడు సార్లు వీఆర్‌లోకి వెళ్లిన అతడికి విజిలెన్స్‌లో చోటు ఎవరి ద్వారా వచ్చిందా అన్న అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి కార్తీకమాసం ఆదివారం కావటంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా తరలివచ్చారు. కొందరు మొక్కుబడుల మేరకు తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. కొండపైన క్యూలైన్లలో చేరి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా జరిగేందుకు ఈవో వీకే శీనానాయక్, అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నప్రసాదం సత్వరం అందేలా ఈవో తగు చర్యలు తీసుకున్నారు.

నాట్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కూచిపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం-కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో నాట్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీఏ కూచిపూడి నృత్యం, సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో, యక్షగానం, సాత్వికాభినయం కోర్సుల్లో ప్రవేశానికి అప్లికేషన్ ఫీజు రూ.500 చెల్లించి పూర్తిచేసిన దరఖాస్తులను 15నవంబరు 2025లోగా కన్వీనర్ సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బొమ్మూరు, రాజమహేంద్రవరం చిరునామాకు పంపాలని తెలిపారు. అపరాధ రుసుము రూ.200లుతో నవంబరు 20వ తేదీ వరకు గడువు ఉంటుందని తెలిపారు. వివరాలకు 9441370591 నెంబరులో సంప్రదించాలన్నారు.

భవిష్యత్తులో ఉన్నతశిఖరాలకు చేరాలి

» కార్తీక్‌కు కలెక్టర్ బాలాజీ అభినందన



పామర్రు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనంలోనే సాహసంతో కూడిన ఈత పోటీల్లో కార్తీక్ రాష్ట్ర చాంపియన్‌గా రాణించడం అభినందనీయమని.. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో జిల్లా పంచాయతీ అధికారిణి జె.అరుణ కుమారుడు కార్తీక్ అత్యంత ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలిచిన సందర్భంగా కలెక్టర్ బాలాజీ ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

» ఎమ్మెల్యేకు మహిళల ఫిర్యాదు

కృత్తివెన్ను, అక్టోబరు 26 : ఇళ్ల మధ్య మద్యం దుకాణం తొలగించాలని ఆదివారం శీతనపల్లి మహిళలు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని శీతనపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన, ఇళ్ల మధ్య ఇటీవల మద్యం దుకాణం ఏర్పాటుపై గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వస్తున్నా హడావిడిగా అమ్మకాలు ప్రారంభించారు. దీంతో గ్రామస్థులు, గ్రామ పెద్దలతో కలిసి పార్టీ నేతలు శని, ఆదివారం నిరసనకు దిగారు. షాపునకు అనుమతులున్నాయని ఎక్సైజ్, పోలీసు అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అనడంతో దుకాణం తొలగిస్తామని హామీ ఇచ్చారు. మరల అమ్మకాలు జరుగుతున్నాయంటూ మహిళలు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను ఫిర్యాదు చేసారు. ఎమ్మెల్యే స్థానిక పోలీసు అధికారులతో చర్చించి, షాపును వేరే చోట ఏర్పాటు చేయాలని సూచించడంతో గ్రామస్థులు శాంతించారు.



జలధీశ్వరస్వామి సేవలో భక్త రామదాసు మునిమనుమడు

ఘంటసాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని భక్తరామదాసు 11వ తరం మునిమనుమడు కంచర్ల వెంకట రమణ ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు దాలిపర్తి చలపతిరావుచే స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన భక్తరామదాసు మునిమనుమడు వెంకట రమణను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

సామూహిక సత్యనారాయణ వ్రతం



ఉయ్యూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ఆవరణలో కార్తీక మాసం పురస్కరించుకుని సాత్విక్ యోగా ఆధ్వర్యంలో వనసమారాధన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజల్లో గండిగుంట, ఉయ్యూరు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. యోగా శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేశారు. యోగా గురువులు కృష్ణ, రాధాకృష్ణమూర్తి, శివాలయం మాజీ చైర్మన్ కుటుంబరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల ఇబ్బందులు తీర్చండి

ఎక్సైజ్ శాఖ నూతన కమిషనర్‌కు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వినతి



ఎక్సైజ్ కమిషనర్‌ను సత్కరిస్తున్న గురుమూర్తి, శివరాంప్రసాద్

పెనమలూరు, అక్టోబ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి, అణచివేతకు గురైన కల్లుగీత కార్మికులకు పరిహారం ఇప్పించి వారి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి నూతన ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్‌తో కలిసి వీరంకి గురుమూర్తి కల్లుగీత కార్మికుల వెతలను నివేదించారు.

వాకర్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కేపీఆర్ కిషోర్

గన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరత ఉందని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేపీఆర్ కిషోర్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె, ఊపిరితిత్తులు, బీపీ, షుగర్, నేత్ర, సాధారణ వైద్య పరీక్షలను వైద్యులను జరిపారు. మహిళలకు క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలు చేశారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి బి.కోటేశ్వరరావు, వాకర్స్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం



కంకిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీసీల సంక్షేమ, అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సెంగపు రంగారావు అన్నారు. రాష్ట్ర దుదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన షేక్ బాలాజీని ఆదివారం అభినందించారు. నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, షేక్ షకార్, వణుకూరు విక్రం, బొర్రా వెంకటర్, వడ్డాది శ్రీనివాసరావు, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

నేడు కానూరులో విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కానూరు సెక్షన్ మురళీనగర్ సబ్‌స్టేషన్ పరిధి మురళీనగర్, గౌరీశంకర్ నగర్ ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పలు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్, వినాయక్‌నగర్, గౌరీశంకర్ నగర్, బళ్లెంవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలో పలు రోడ్లను, డ్రెయినేజీలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకిలో రూ. 45లక్షలతో నిర్మించిన ఆంధ్ర హోమ్ ఫుడ్స్ రోడ్డు, డ్రైవర్‌పేట రోడ్డును ప్రారంభించి ఆయన మాట్లాడారు. స్థానిక ప్రజలకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని అనుక్షణం పనిచేస్తున్నామని తెలిపారు. అయినా ఇంకా కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీళ్ల నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటి పూర్తికి లనేక వినతుల వస్తున్నాయని తెలిపారు. గత వైసీపీ పాలనలో రోడ్లకు కనీసం మరమ్మతులు చేయకపోవడంతో టీడీపీ కూటమి ప్రభుత్వంపై భారం పడుతోందని, అయినా రాజీ పడకుండా రోడ్లు, డ్రైన్ల పూర్తికి కృషి చేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, సంగెపు రంగారావు, చెన్నుపాటి శ్రీనివాస్, కాంట్రాక్టరు ప్రసాద్, వడ్లమూడి శుభశేఖర్, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, మహిళానేతలు పాల్గొన్నారు.

రోటరీ నేత్ర వైద్యశాలలో అధునాతన వైద్యపరికరం ప్రారంభం

ఉయ్యూరు : సమాజ సేవలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. రోటరీ సర్వీస్‌ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోటరీ నేత్రవైద్యశాలలో రూ. 42 లక్షలు విలువచేసే అధునాతన ఐఓఎల్ స్కానింగ్ పరికరాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లకు పైగా రోటరీ సర్వీస్ ట్రస్టు నేత్ర వైద్య సేవలతోపాటు, వానప్రస్థవృద్ధాశ్రమం ద్వారా వృద్ధులకు సేవలదిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమని కొనియాడారు. అధునాతన పరికరాలతో తక్కువ ఖర్చుతో నేత్రవైద్యసేవలందిస్తూ రోటరీక్లబ్ ద్వారా సమాజసేవలో ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. సర్వీస్ ట్రస్టు చైర్మన్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రారంభించిన పరికరం ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో మొట్టమొదటి అధునాతన నేత్ర స్కానింగ్ పరికరమన్నారు. సెక్రటరీ వసంతరావు, పున్నారావు, మేనేజర్ కోటిరెడ్డి, అనీస్, సుబ్రమణ్యం, పులి శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ మండవ జయదేవ్, అనుమోలు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ విజేతలకు పతకాలు అందజేత



గన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు గన్నవరం సమీపంలోని హరివిల్లు వెంచర్‌లో ఆదివారం నిర్వహించారు. కృష్ణాజిల్లా స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్-2025, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు పతకాలను అందజేశారు.

జోష్ కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు : మంగళగిరిలో ఆదివారం జరిగిన 16వ అంతర్రాష్ట్ర ఇన్విటేషనల్ జపాన్ షిటో-రియో కరాటే ఛాంపియన్‌షిప్-2025 పోటీలలో తాడిగడప మునిసిపాలిటీలోని జోష్ అకా డమీ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచినట్లు అకాడమీ ప్రతినిధులు తెలిపారు. బాలికల విభాగంలో జే వర్షిక, జీ నీహారిక, బాలుర విభాగంలో బీజీ శౌర్య, జీ విష్ణువర్ధన్ సాయి, కే ప్రదీప్‌సాయిలు విజేతలుగా నిలిచినట్లు సంస్థ ప్రతినిధి మాస్టర్ సత్యసాయి తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు కేన్సర్ పరీక్షలు



కానూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన నెల సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అను ఒమేగా హాస్పిటల్, వైఎస్ఆర్ చారిటీస్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో ఆదివారం కానూరులోని వరలక్ష్మీపురం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాలులో తాడిగడప మున్సిపాలిటీలో పనిచేసే మహిళా పారిశుధ్య కార్మికులకు రొమ్ము కేన్సర్, గర్భశయ కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయభాస్కర్, కనకదుర్గ దేవస్థానం సభ్యుడు వెలగపూడి శంకరబాబు, డి. రవికిరణ్, వైద్యనిపుణులు డాక్టర్ నాదెళ్ల ఆదిత్య, బత్తుల కవితతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. 113 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



ముదునూరులో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

కానూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముంచుకు వస్తున్న మొంథా తుఫాన్ నేపథ్యంలో తాడిగడప మున్సిపాలిటీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిప ల్ కమిషనర్ షేక్ నజీర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లోని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, తుఫాన్ వల్ల ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండాలని వారి సహాయం నిమిత్తం తాడిగడప మున్సిపాలిటీలోని పోరంకి, కానూరు, తాడిగడప, యన మలకుదురు గ్రామాల్లోని 19 సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా తాడిగడప మున్సిపల్ కార్యాలయంలో సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఈ కంట్రోల్ రూమ్‌లు పనిచేస్తాయని చెప్పారు. 9154690391, 0866 4054030 టెలీఫోన్ నెంబర్లను సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఉయ్యూరు : రానున్న మూడు రోజుల్లో మొంథా తుపాను జిల్లాపై విరుచుకుపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు గ్రామ ప్రజలకు సూచించారు. మండల పరిధి కడవకొల్లు, ముదునూరు, కాటూరు, కాకానినగర్‌లో ఆదివారం పర్యటించి, తుపాను ప్రభావం ఎలా ఉండవచ్చనది ప్రజలకు వివరించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముదునూరు మాజీ సర్పంచ్ ఎం. జ్ఞానశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ● మొంథా తుపానుపై మండల పరిధిలో అధికారులతో తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆదివారం సమీక్షించారు. తుపాను ప్రభావం మూడురోజులు ఉంటుందన్నారు. ● మొంథా తుపాను కారణంగా భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెవెన్యూ డివిజన్ పరిధిలో మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్టు ఉయ్యూరు ఆర్డీవో బి.హేలాషారోన్ ఓ ప్రకటనలో తెలిపారు.

కాలువలో మునిగి యువకుడి మృతి

ఉంగుటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సరదాగా ఈత కొడుతూ ప్రమాదవశాత్తు కాలువలో మునిగి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆత్కూరులో ఆదివారం జరిగింది. ఆత్కూరు ఎస్సై ఎన్ లక్ష్మీనరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ముస్లింపేటలో నివాసముంటున్న వేముల చినరామలింగేశ్వరరావు చిన్నకుమారుడైన వేముల నరేష్(21)హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి విజయవాడలోని ఓ హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన బంధువు ప్రదీప్‌తో కలిసి బైక్‌పై మధ్యాహ్నం సమీపంలోని ఏలూరు కాలువ వద్దకు వెళ్లాడు. ఇరువురూ కలిసి రేవులో బైక్‌ను శుభ్రపరిచారు. ఆతర్వాత కాలువలో సరదాగా ఈతకొడదామని నరేష్ ప్రదీప్‌ను అడిగాడు. నాకు ఈత రాదని చెప్పి ప్రదీప్ గట్టుపై కూర్చున్నాడు. పూర్తిస్థాయిలో ఈతరాని నరేష్ కాలువలో దిగి నీటి ప్రవాహానికి అడ్డంగా ఈత కొడుతూ అవతలి గట్టువైపునకు వెళ్లాడు. తిరిగి ఇవతలి గట్టువైపునకు వచ్చే క్రమంలో ఆయాసంతో ఒడ్డుకు చేరలేక కాలువలో మునిగి చనిపోయాడు. నీటిలో మునుగుతున్న నరేష్‌ను కర్ర సాయంతో కాపాడేందుకు బాజీ అనే యువకుడు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. 112ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. బంధువుల సాయంతో నరేష్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టమ్ నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైసీపీ శవరాజకీయాలు మానుకోవాలి : దేవినేని రాజా

కంకిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా సిగ్గు రాలేదని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా తీవ్రంగా విమర్శించారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ, కర్నూలు జిల్లా బస్సు ప్రమాదానికి కారణమైన వ్యక్తి బెల్టు షాపులో మద్యం సేవించాడంటూ సొంత పత్రికలో అసత్య ప్రచారానికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సింది పోయి సొంత పత్రికలో అసత్య ప్రచారానికి పాల్పడుతుందని మండిపడ్డారు.

విద్యాభివృద్ధికి మానవత చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధితో పాటు సామాజిక అవసరాలను గుర్తించి సేవలందించడమే మానవత సేవా సంస్థ లక్ష్యమని రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. హనుమాన్‌జంక్షన్ మానవత కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీఎస్సీ (నర్సింగ్) చదువుతున్న దాసరిగూడెంకు చెందిన అనిల్‌కు రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జయరామ చంద్రరావు, పాబోలు గణేష్, వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

గన్నవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్‌లకు టెట్ మినహాయించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి రాకముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి టెట్ ఉత్తీర్ణులు కావాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు.

సూర్య పాఠశాలకు ఎడ్యూకాన్-2025 అవార్డు

పెనమలూరు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు సూర్య విద్యానికేతన్‌కు రాష్ట్ర స్థాయి ప్రతిష్ఠాత్మక ఎడ్యూకాన్ అవార్డు లభించిందని సంస్థ డైరెక్టర్ అబ్రార్ అలీ తెలిపారు. విద్యారంగంలో విశేష కృషి చేసి విద్యార్థుల భవిష్యత్తును రూపుదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న సూర్యవిద్యానికేతన్‌కు ఎంపీ, గీతం విశ్వవిద్యాలయం అధినేత ఎం భరత్ చేతుల మీదుగా అవార్డు లభించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ అలీని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

వన్‌టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెనమలూరు నుంచి బస్సులో స్నేహితుడుతో కలసి విజయవాడ వచ్చి బందరు రోడ్డులో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని సూర్యారావుపేట పోలీసులు అతని తల్లిదండ్రులకు ఆదివారం అప్పగించారు. పెనమలూరులో ఒక కాలనీకి చెందిన కొంగళ్ల రమేష్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతని కుమారుడు మనీష్ కుమార్ (14) ఆదివారం స్నేహితుడుతో కలిసి పెనమలూరు నుంచి బస్సులో రాఘవయ్యపార్క్ దగ్గరకు వచ్చాడు. ఇతను బందరు రోడ్డు డీసీపీ బంగ్లా వద్ద ఒంటరిగా తిరుగుతుండగా డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు బాలుడుని పట్టుకుని వివరాలు అడిగారు. బాలుడు తన పూర్తి వివరాలు చెప్పలేక పోవటంతో సూర్యారావుపేట పోలీసులకు అప్పగించారు. సీఐ అహ్మద్ ఆలీ బాలుడి పూర్తి వివరాలు తెలుసుకుని అతని తల్లిదండ్రులకు సమాచారం తెలియపరిచారు. సీఐ రమేష్‌కు కూమారుడిని అప్పగించారు.

సంస్కృతులను కాపాడుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : భారతీయ పురాతన సంస్కృతులను కాపాడుకోవడమే శివశక్తి లక్ష్యమని ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. మల్లవల్లిలో శివశక్తి శతాబ్ది ఉత్సవాల ఆహ్వానపత్రికలను ఆదివారం ప్రజలకు అందజేశారు. సర్పంచ్ నాగమణి, కొలుసు బలరాం, లక్ష్మణ్, భజన బృంద సభ్యులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి

మొగల్రాజపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దాతల నుంచి సహాయం అందుకుంటున్న ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుని వారి దాతృత్వాన్ని సార్థకం చేసుకోవాలని వారి స్ఫూర్తితో మీరు మరికొందరికి సాయం చేయాలని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి అన్నారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం కమ్మ విద్యార్థి సహాయక సంఘం ఆధ్వర్యంలో 440 మంది విద్యార్థులకు రూ. 30 లక్షల ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి చనుమోలు కృష్ణారావు, ఉపాధ్యక్షులు పొట్లూరి భాస్కర్‌రావు, మక్కెన ఆంజనేయులు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతాలకు జీవం పోసిన కూటమి ప్రభుత్వం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేంపాడు మేజర్ తవ్విన తరువాత కాలువ ద్వారా మొట్టమొదటిగా సాగర్ జలాలు బిళ్లనపల్లి రావడం ద్వారా వినాయకచెరువు నిండటం కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమయిందని నీటి సంఘ అధ్యక్షుడు కాకుమాను గోపి హర్షం వ్యక్తం చేశారు. బిళ్లనపల్లిలోని వినాయకచెరువు సాగర్ జలాలతో ఆదివారం నిండటంతో రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు చేసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. వేంపాడు మేజర్ కాలువ తవ్వి 50 సంవత్సరాల్లో ఇప్పటివరకూ సాగర్ జలాలు రాలేదని, ప్రస్తుత ప్రభుత్వ కృషితోనే సాగర్‌జలాలతో 12ఎకరాల వినాయకచెరువు నిండి జలకళ రావడం ఇదే ప్రథమమని హర్షం వ్యక్తం చేశారు. కొన్నిదశాబ్దాల తరువాత చెరువు నిండి కళకళ లాడటంతో మహిళలు,రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సాగర్ జలాలకు పూజలు చేశారు.


మెడికల్ సీట్లు సాధించిన ఎస్సార్ విద్యార్థులకు సన్మానం



పెనమలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీట్-2025లో ఉత్తమ ర్యాంకులు సాధించి మెడికల్ సీట్లు సాధించిన తమ సంస్థకు చెం దిన విద్యార్థులను ఎస్సార్ కళాశాల ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కళాశాలలో రెగ్యులర్ ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకొన్న విద్యార్థుల్లో 46మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు వారు తెలిపారు.కళాశాల చైర్మన్ ఏ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సీఈవో సురేంద్రరెడ్డి, డీజీఎం రమణ పాల్గొన్నారు.

దిక్సూచి

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్


మొత్తం ఖాళీలు: 90

ఇండియన్ ఆర్మీలోని 10 ప్లస్ 2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాల కోసం అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు. ఇందులో ఎంపికైన వారికి బీటెక్ డిగ్రీతోపాటు, సైన్యంలో లెఫ్టినెంట్ ఉద్యోగంలో చేరవచ్చు.

కోర్సు:
టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 55 కోర్సు(టీఈఎస్) - 2025 జూలై 2026

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అయితే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. దీనితోపాటు జేఈఈ మెయిన్ 2025 స్కోరు సాధించాలి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి పదహారున్నర సంవత్సరాల నుంచి పంతొమ్మిదిన్నర సంవత్సరాల మధ్యలో ఉండాలి.

వేతనం: మిలిటరీ సర్వీస్ పే కింద చదువుకునే కాలంలో స్టైపెండ్ నెలకు 15,500/- రూపాయలు లభిస్తుంది. తర్వాత 56,000/- వేతనంతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి.

ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కోర్సు శిక్షణ: కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఇందులో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, బీటెక్ టెక్నికల్ శిక్షణ ఇస్తారు. మొదటి మూడేళ్లు పుణె, సికింద్రాబాద్, మావ్‌లోని ఆర్మీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది. తరవాత డెహ్రాడూన్‌లోని 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో శిక్షణ కొనసాగుతుంది. ఆపై డిగ్రీతోపాటు, లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో విధుల్లోకి తీసుకుంటారు.

చివరి తేదీ: 2025 నవంబర్ 13
వెబ్‌సైట్: joinindianarmy.nic.in



డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి యూసీడ్ - 2026

డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్'(యూసీడ్)- 2026 నోటిఫికేషన్ వెలువడింది. దీనిని బాంబే ఐఐటీ నిర్వహిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఐఐటీలు సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలోని బీడిజైన్ కోర్సుల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఇంటర్ పూర్తి చేసిన వారు యూసీడ్ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. 'యూసీడ్ స్కోరు వాలిడిటీ ఏడాది. వరుసగా రెండు సంవత్సరాలు మాత్రమే అభ్యర్థులు ఈ ఎంట్రెన్స్ రాయవచ్చు.

వయస్సు: దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2001 అక్టోబర్ 10 తరువాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్ల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 31
పరీక్ష తేదీ: 2026 జనవరి 18 **ఫలితాలు:** 2026 మార్చి 6
పరీక్ష సెంటర్లు: తెలుగు రాష్ట్రాల్లో యూసీడ్ పరీక్ష సెంటర్లు హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.
వెబ్‌సైట్: www.uceed.iitb.ac.in/2026/



పారా మెడికల్‌లో పీజీ, పీజీ డిప్లొమా

ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ కలిసి పీజీ, పీజీ డిప్లొమా(సెల్ఫ్ సపోర్టెడ్) కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: రెండు సంవత్సరాల కోర్సు ఇది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. కోర్సు ఫీజు 55000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 40000 రూపాయలు.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
చివరి తేదీ: 2025 నవంబర్ 7
ఫోన్: 7995013421, 7207953919
వెబ్‌సైట్: www.audoa.andhrauniversity.edu.in



డీఆర్‌డీఈలో అప్రెంటిస్‌షిప్

బెంగళూరులోని డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

ఖాళీల వివరాలు:
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(ఇంజనీరింగ్)- 23
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(జనరల్) - 27
- డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్ - 27
- ఐటీఐ అప్రెంటిస్‌షిప్ - 30

మొత్తం ఖాళీలు 105

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు ఉన్నాయి.

అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

వయస్సు: 18 సంవత్సరాలు పూర్తి కావాలి.

దరఖాస్తు విధానం: ఐటీఐ అభ్యర్థులు ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో, ఇతరులు ఎన్ఏటీఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్వ్యూ హాజరు కావాల్సిన తేదీ: 2025 నవంబర్ 4
చిరునామా: ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.
వెబ్‌సైట్: drdo.gov.in/



SCHOLARSHIP ALERT

Mahindra Big Boss Nayi Pehchan Scholarship

Description: The Mahindra Big Boss Nayi Pehchan Scholarship 2025-26 is designed to empower children of freelance tractor mechanics by offering a scholarship of INR 6,000 annually to support their educational journey.

Eligibility:
- Children of freelance tractor mechanics.
- Aged 7 to 21 years, enrolled in school, college, or vocational courses.
- 50% marks (or equivalent) in the previous class/semester.
- Open to students across India.
- SC/ST/OBC reservations available.
- Children of Buddy4Study or Mahindra & Mahindra Ltd. employees are not eligible.

Prizes & Rewards: Students will receive a scholarship amount of INR 6000/-.
Last Date to Apply: 15-11-2025
Application mode: Online applications only

L'Oréal For Young Women in Science Program

Description: L'Oréal India offers the L'Oréal For Young Women in Science Program 2025-26 for young women who have passed Class 12 and wish to pursue higher education in scientific fields.

Eligibility: Open to female students only.
- Annual family income should not exceed INR 6,00,000.
- **UG students:** Must have secured at least 85% marks in Class 12 (Science Stream) and be pursuing an undergraduate degree in a science-related field (except final-year students).
- **PG/PhD students:** Must have secured at least 60% marks in their undergraduate course and be pursuing post-graduation (any year) in fields such as Technology, Science, Pharma, Life Sciences, Biotechnology, etc. (except final-year students).
- Students from PAN India are eligible.
- Children of L'Oréal India and Buddy4Study employees are not eligible.

Prizes & Rewards:
- **UG students:** Fixed scholarship of INR 62,500
- **PG and PhD students:** Upto scholarship of INR 1,00,000

Last Date to Apply: 03-11-2025 *Application mode:* Online only
Short Url: www.b4s.in/aj/LIS6

Muskaan Scholarship Program 2.0

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support
Last Date: 05-11-2025 *Application:* Online only
Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నా పరువుకు భంగం కలుగుతోంది

● సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు



తన రూపాన్ని పోలిన ఏఐ డీప్‌ఫేక్ చిత్రాలను, వీడియోలను సృష్టించి... వాటికి అసభ్య, అశ్లీల కంటెంట్‌ను జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని హీరో చిరంజీవి శనివారం సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధనార్జనే ధ్యేయంగా నా రూపాన్ని మార్ఫింగ్ చేస్తూ, అసభ్యకరమైన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న పలు అక్రమ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ చానల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చిన కొన్ని వెబ్ లింక్స్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. 'దశాబ్దాల పాటు కష్టపడి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ఇలాంటి చర్యలతో నా పరువుకు భంగం కలుగుతోంది. కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న నన్ను కించపరిచేలా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీచపు పనులకు పాల్పడుతున్నారు. వారిని కఠినంగా శిక్షించండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)



హీరో నారా రోహిత్, శిరీషల వివాహం ఈ నెల 30న జరగనుంది. ఆదివారం హల్దీ వేడుకతో పెళ్లి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషతో దిగిన ఫొటోను నారా రోహిత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

పోరాటాలే ప్రత్యేకాకర్షణగా

గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్ రెడ్డి ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనేది వర్కింగ్ టైటిల్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కథానాయకుడు గోపీచంద్, ఇతర తారాగణం పాల్గొంటుండగా వెంకట్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్‌గా నిలవనుందని యూనిట్ తెలిపింది. కాగా, మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆ పోస్టర్‌లో యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేశారు. మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో గోపీచంద్ కనిపించబోతున్నట్లు ప్రచార చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం వల్ల అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీఓపీగా వ్యవహరిస్తుండగా, అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.



రజనీ - కమల్ మూవీ పక్కా



రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం కాబోతోంది? దర్శకుడు ఎవరు? అనే విషయాలు మాత్రం ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. మొదట్లో ఈ ప్రాజెక్టుకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ పేరు విన్పించింది. కానీ తాను డైరెక్ట్ చేయడంలేదని ప్రదీప్ తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అన్న అనుమానాలు అభిమానుల్లో కలిగాయి. అయితే రజనీకాంత్ కూతురు సౌందర్య మాత్రం కచ్చితంగా ఈ సినిమా తెరకెక్కుతుందని అంటున్నారు. ఇటీవల ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆమె ఈ సినిమాని రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తారని స్పష్టం చేశారు. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ కలసి నటిస్తే చూడాలనే ఆశ తనకూ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి, వివరాలను నాన్నగారు త్వరలో స్వయంగా వెల్లడిస్తారు అని సౌందర్య తెలిపారు. ఆ మధ్య సైమా అవార్డుల వేడుకలో కూడా కమల్ హాసన్ ఈ విషయంపై స్పందించారు. 'ప్రేక్షకులు మా కాంబినేషన్‌ని ఇష్టపడితే మంచిదే కదా, వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మీ ముందుకు కలసి రానున్నాం' అని అన్నారు. కాగా, వీరిద్దరూ కెరీర్ తొలినాళ్లలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి హిట్ చిత్రాలతోపాటు సుమారు ఇరవైకి పైగా చిత్రాల్లో కలసి నటించారు. 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీ, కమల్ కలసి నటించలేదు.

నెపోలియన్ రిటర్న్స్



కొన్నేళ్ల క్రితం 'నెపోలియన్' చిత్రంలో 'నా నీడ పోయింది సార్...' అంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అందర్నీ ఆకర్షించిన ఆనంద్ రవి ఈసారి మరో ఉత్కంఠభరితమైన కథతో వస్తున్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కొత్త చిత్రం 'నెపోలియన్ రిటర్న్స్'. ఆచార్య క్రియేషన్స్ పతాకంపై భోగేంద్ర గుప్త నిర్మిస్తున్నారు. దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన వేడుకలో టైటిల్‌ను ఆవిష్కరించి, గ్లింప్స్ విడుదల చేశారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ 'ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నరకు పైగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి కథతో అందరి ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను పేరెంట్స్, ప్రతినిధి, నెపోలియన్, కొరమీను వంటి విభిన్న కథా చిత్రాలను తీశాను. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. 'నెపోలియన్ రిటర్న్స్'తో ఆ రెండూ వస్తాయనే నమ్మకం ఇప్పుడు కలుగుతోంది. సినిమా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంతవరకూ ఎక్కడా సినిమా రాలేదు' అని పేర్కొన్నారు. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుంది' అని చిత్ర కథానాయిక దివి అన్నారు.

లార్డ్ మార్కో?



మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కొత్త చిత్రం ఖరారైంది. 'మార్కో', 'కట్టలాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత షరీఫ్ మహ్మద్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతోందో తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. మునుపెన్నడూ పోషించని ఓ విభిన్నమైన పాత్రలో మమ్ముట్టి కనిపించనున్నట్లు షరీఫ్ తెలిపారు. దర్శకుడు, ఇతర తారాగణం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అయితే ఈ చిత్రం పేరు 'లార్డ్ మార్కో' అయి ఉంటుందని పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలిసి నెల రోజుల క్రితం కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో 'లార్డ్ మార్కో' టైటిల్‌ని రిజిస్ట్రేషన్ చేయించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. కాగా, మమ్ముట్టి నటించి, నిర్మించిన 'కలమ్ కావల్' సినిమా నవంబరు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల తర్వాతే మమ్ముట్టి కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలున్నట్లు సమాచారం.

లవ్ అండ్ వార్ ఇటలీలో క్లైమాక్స్‌కు





దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ గ్రాండియర్‌గా తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్, అలియాభట్ ప్రధాన తారాగణం. త్వరలో ఇటలీలో ఈ చిత్రం షెడ్యూల్ జరగాల్సి ఉంది. అయితే ఆ షెడ్యూల్‌ను రద్దు చేసి ముంబైలోనే షూటింగ్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. భారీ సెట్స్ నిర్మించి అందులో ఇటలీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే ఆ వార్తల్లో నిజం లేదని మేకర్స్ తెలిపారు. అయితే ఆ షెడ్యూల్ రద్దు కాలేదని మేకర్స్ తెలిపారు. కథానుసారం రియల్ లొకేషన్లలోనే చిత్రీకరించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో పది రోజుల షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేస్తున్నారు. అది పూర్తయ్యాక 20 రోజుల పాటు సాగే గ్రాండ్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను డిసెంబర్‌లో ఇటలీలో చేయనున్నారు. అక్కడ 45 రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసినా చివరకు 20 రోజులకు కుదించినట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆర్యన్ ప్రణయ గీతం



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఈనెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి(శ్రేష్ఠ మూవీస్) విడుదల చేస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'పరిచయమే...' అంటూ హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రణయ గీతాన్ని విడుదల చేసింది. సామ్రాట్ రాసిన ఈ గీతానికి జిబ్రాన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. వరుస హత్యల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రానికి హరీశ్ కన్నన్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

మచిలీపట్నం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్‌చైర్మన్‌గా వంపుగడల చౌదరి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు వైస్‌చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన వంపుగడల చౌదరిని ఎంపిక చేశారు. మచిలీపట్నం మాజీ కౌన్సిలర్ వంపుగడల చౌదరి తనకు వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ చర్చించి వంపుగడల చౌదరికి వైస్ చైర్మన్ పదవి ఇచ్చారు. చైర్మన్‌గా ఐ.దిలీప్‌కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.



మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్‌ను సత్కరిస్తున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

మైనారిటీల అభివృద్ధికి రూ.170 కోట్లు : హసీంబేగ్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం రూ. 170 కోట్లు కేటాయించిందని స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ అన్నారు. సన్ స్టార్ స్కూల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ హసీంబేగ్‌ను ఘనంగా సత్కరించారు. హసీంబేగ్ మాట్లాడుతూ, ఈనెల 29న మైనారిటీ కార్పొరేషన్ విధి విధానాలపై విజయవాడలో చర్చిస్తున్నామన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్, మానవత జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరామ్, అయ్యప్ప స్వామి, ఆదిత్య, నూర్ల హన్, కొరెడ్ల సుశీల, రాజేంద్రప్రసాద్, కృష్ణమోహన్, వెత్స సత్యనారాయణ, చిం తయ్య తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండలి బుద్ధప్రసాద్

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయండి

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామానికి చెందిన 12 మంది ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వెలువోలు గ్రామపార్టీ అధ్యక్షుడు కోనేరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గోగినేనిపాలెం జనసైనికుడు కుంపటి నాగ శ్రీను, 12 మంది జనసేన పార్టీలో చేరారు. మండలి వెంకట్రామ్, చోరగుడి రవి, కొడాలి నరేంద్ర, కుంపటి వెంకన్న, నాగగోపి తదితరులు పాల్గొన్నారు.



మేకావారిపాలెంలో సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి

మేకావారిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేకావారిపాలెంలో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. రూ.10 లక్షల వ్యయంతో గ్రామంలో మూడు సీసీ రహదారులు నిర్మిస్తుండగా, చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి భూమిపూజ చేసి పనులు ప్రారంభించి పనులు పర్యవేక్షించారు. బీసీ కాలనీలో రహదారి నిర్మాణానికి కృషిచేసిన జడ్పీటీసీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ప్రముఖ రాజులపాటి శివప్రసాద్, వార్డు సభ్యురాలు రాజులపాటి రామలక్ష్మి, గ్రామస్థులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాజులపాటి నాగజ్యోతి, మాణిక్యం, వెంకటేశ్వరమ్మ, నాంచారయ్య, వెంకటేశ్వరరావు, సురేష్, సుబ్బారావు, పెద్దనరసారావు తదితరులు పాల్గొన్నారు.



ఈస్ట్‌చానల్ కింద మునిగిన పొలాలను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

నీటమునిగిన పంట పొలాల పరిశీలన

కోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్‌చానల్ 16వ నెంబరు పంట కాలువ కింద నీటమునిగిన పంట పొలాలను మండల టీడీపీ నేతలు ఆదివారం పరిశీలించారు. గత ఏడు సంవత్సరాలుగా హంసలదీవి, పాలకాయితిప్ప, దింటిమెరక తదితర ప్రాంతాల్లో నాలుగు వేల ఎకరాల్లో పంట వేసేందుకు వీలు కావటం లేదని, పంట వేసినా నీటమునుగిపోయిందని, దీని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాలకాయితిప్ప అవుట్‌ఫాల్స్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, వేములపల్లి రాజేష్, బొలిశెట్టి విఠల్ రావు, తోట సాంబయ్య, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అప్పికట్ల రవీంద్ర, కాగిత ప్రసాద్, గోగినేని సోమశేఖరరావు, రేపల్లె ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



వి.నాగప్రవీణ్‌కు అవార్డు ఇచ్చి సత్కరిస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు

నాగప్రవీణ్‌కు అబ్దుల్ కలాం అవార్డు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాలకు పేదలకు విద్య అందిస్తున్న శివగంగలోని స్వాతి స్కూల్ అధినేత వి.నాగప్రవీణ్ ఆదివారం అబ్దుల్ కలాం నేషనల్ అవార్డును అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, డాక్టర్ పి. నాగయ్యఅవార్డును నాగప్రవీణ్‌కు అందజేశారు. ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు సుందరరాం, రోహిణి భవానీ, కొమరగిరి చంద్రశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రైన్ల లోని మురుగునీరు సక్రమంగా పారేందుకు మునిసిపల్ అధికారులు చర్యల చేపట్టారు. గొడుగుపేట, కేశవరావుతోట, ఆదర్శనగర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూటుకాడను, పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. గొడుగుపేట శివారు డ్రెయిన్లలో తూటుకాడ, గుర్రపుడెక్కను తొలగించే పనులను కట్టా అంజిబాబు చేపట్టారు.



తహసీల్దార్ కార్యాలయం శ్లాబును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ



కృత్తివెన్నులో అధికారులతో సమావేశమై తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న కాగిత ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



గోగినేనిపాలెంలో పర్యటించి తుఫాన్ జాగ్రత్తలపై యానాదులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో సుబ్బారావు

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి : కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులపాటు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శనివారం ఆయన చల్లపల్లిలో పర్యటించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరాయంగా సరఫరా ఉండేలా చూడాలన్నారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరి ఉండటం, వర్షాలకు పెచ్చులూడి పడుతున్న నేపథ్యంలో ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్ విజ్ఞప్తితో కార్యాలయ గదులను కలెక్టర్ బాలాజీ పరిశీలించారు. పెచ్చులూడిన శ్లాబ్‌ను చూశారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చుకోవాలని, ఈమేరకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్‌కు సూచించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీకి వెక్ట్రా మిషన్ మంజూరు అయిందనీ, తుఫాను అనంతరం చల్లపల్లి వచ్చి అందజేస్తామన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విద్యుత్ శాఖ డీఈ పులి శివనాగేశ్వరరావు, డిప్యూటీ సీఈవో ఆర్‌వి.ఆనందకుమార్, ఇన్‌చార్జి ఏఈ బసవశాస్త్రులు, సూపరింటెండెంట్ అతావుల్లా, ఏఈలు బొప్పన శ్రీనివాసరావు, ధర్మేశ్వరరావు, చల్లపల్లి కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, ఎల్‌ఐ ఎలీషాప్రసాద్, కార్యదర్శులు, వీఆర్వోలు, రైతుసంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

ఎంపీడీవో గ్రామాల్లో పర్యటన

ఘంటసాల : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుబ్బారావు పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. తుఫాన్ హెచ్చరికలను ఎప్పటికప్పుడు మైక్, టాంటాం ద్వారా ప్రజలకు తెలియజేసి వారిని సన్నద్ధం చేయాలని కార్యదర్శులను హెచ్చరించారు. పూరిగుడిసెల్లో నివశిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో శానిటేషన్‌కు మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తుఫాన్ ప్రభావం ఎలా ఉన్నా ఎదుర్కొనేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలన్నారు. శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల ప్రజలు, పశువులు కృష్ణానది వైపుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి తగు సలహాలు, సూచనలు చేశారు.



నాగాయలంకలో పశువుల రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న డాక్టర్ సాయిమౌనిక

ప్రజల్లో ధైర్యం నింపాలి : ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాణ నష్టం ఏమాత్రం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్తి నష్టం తగ్గించేలా చూడాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు, ప్రజల్లో ధైర్యం నింపేలా అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలతో ప్రజలకు అందుబాటులోనే ఉండాలన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీరావు, తహసీల్దార్ శశికుమార్, ఎస్సై గణేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నాగాయలంక : తుఫాన్ నేపథ్యంలో పశువులు సురక్షితంగా ఉండేందుకు తగిన జాగ్రత్తలను పాటించాలని మండల పశువైద్యాధికారి సాయి మౌనిక పశుపోషకులకు సూచించారు. ఆదివారం పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. పశువులను కరెంట్ స్తంభాల వద్ద కట్టరాదన్నారు. పశువుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు గొంతువాపు జబ్బు నివారణ కోసం వ్యాక్సిన్లు వేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో పశుగ్రాసం, నీరు ముందుగా సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి హాజీబేగ్

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

మోపిదేవి : మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు, అధికారులు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి హాజీ బేగ్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన తుఫాను, అధిక వర్షాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాను ప్రభావంతో రాబోయే నాలుగు రోజులపాటు అధిక వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉన్న సురక్షిత ప్రభుత్వ భవనాలను స్వాధీనం చేసుకొని వాటిలో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.హరినాథ్, ఎంపిడివో స్వర్ణభారతి, ఆయా శాఖల ఉద్యోగులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులను ఇళ్లకు పంపాలి

మచిలీపట్నం టౌన్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో హాస్టల్‌లోని విద్యార్థులందరినీ ఇళ్ళకు పంపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడారు. ఇంకా కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రైవేట్ క్లాసులు నిర్వహిస్తున్నాయన్నారు. హాస్టల్‌లోని విద్యార్థులందరినీ ఖాళీ చేసి ఇళ్లకు పంపాలన్నారు. ర్యాంకులు, పర్సంటేజీల కోసం ప్రైవేటు సంస్థలు విద్యార్థులకు సాయంత్రం పూట ప్రైవేటు క్లాసులు పెడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు.



పెడన కార్తీక వనసమారాధనలో పూజలు చేస్తున్న మహిళలు



అవతార్ మెహెర్‌బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పెడన, చల్లపల్లిలో కార్తీక వనసమారాధన

పెడన, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో చిట్టూరి మాధవరావు తోటలో కార్తీకవనసమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సమారాధనలో పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కాత్యాయని దేవి ఆలయంలో, నాగేంద్ర స్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. మామిడి ప్రసాద్, కేటీ. మురళీకృష్ణ, దేసు శ్రీనివాస్, ఉదయగిరి గోపాల్, కోదూరి రమేష్, జవ్వాజి నాగరాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

మెహర్‌బాబా మందిరంలో

చల్లపల్లి : చల్లపల్లి అవతార్ మెహెర్‌బాబా మందిరంలో ఆదివారం కార్తీక వనసమారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకనామం, సంకీర్తనలు, మద్దాలి దుర్గాప్రసాద్‌చే ఆధ్యాత్మిక ప్రసంగం జరిగాయి. మధ్యాహ్నం మెహెర్ బాబా భక్తులు సమారాధనలో పాల్గొన్నారు. బాబాసెంటరు అధ్యక్ష కార్యదర్శులు చుండూరు మెహర్‌ప్రసాద్, పత్రి రమణారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గోధుమలతో అభిషేకం

నాగాయలంక : రామలింగేశ్వరస్వామికి కార్తీక మాసం సందర్భంగా ఆదివారం 108 కిలోల గోధుమలతో అర్చకులు సాయి కౌశిక్ బ్రహ్మత్వంలో అభిషేకాలు జరిగాయి. భక్తులు విరివిగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను శ్రీరామపాదక్షేత్రం కమిటీ పర్యవేక్షించింది.



[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

వలకట్ల తొలగింపు

కోడూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వలకట్లు తొలగించని కారణంగా వరినాట్లు నీటమునగడంలోపా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డ్రైనేజీ అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు స్పందించారు. ఆదివారం వలకట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. మందపాకల - చింతకోళ్ల రహదారి వెంబడి మురుగు కాలువలోని వలకట్లు, రత్నకోడులోని వలకట్లు తొలగిస్తున్నట్లు డ్రైనేజీ ఏఈ కరీమ్ వెల్లడించారు. వలకట్ల తొలగింపు పనులను నీటి సంఘం అధ్యక్షులతో కలసి పర్యవేక్షించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని క్లౌడ్ స్టాండ్ టెక్నాలజీస్ డైరెక్టర్ చల్లా సురేష్ అన్నారు. పైజెఆర్‌డీఎంఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థుల వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఓల్టేజ్, సర్క్యూట్స్ బిల్డ్ తదితర అంశాలపై ప్రాక్టికల్‌గా వర్క్‌షాపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవికుమార్, ప్రముఖ ఇంజనీర్ హరిప్రసాద్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ నాగజ్యోతి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు పి.శేఖర్, పి.ఎల్.ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.

సత్యసాయి స్వరాష్టకం పోటీలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈడేపల్లి సత్యసాయి బాబా మందిరంలో ఆదివారం సత్యసాయి స్వరాష్టకం పోటీలు నిర్వహించారు. సత్యసాయి సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సత్యసాయి జీవిత చరిత్రపై పలువురు వక్తలు ప్రసంగించారు. విజేతలకు బహుమతులు అందచేశారు. బొడ్డపాటి శైలజ, కాండూరి లక్ష్మీనరసింహాచార్యులు, సిహెచ్.ప్రమీల, కెకెడి మహాలక్ష్మి, కాళికాదేవి, పోతుకూచి నాగమణి, కొట్టి నాగమణి, టి.వెంకటలక్ష్మి, ఎస్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

67 మందికి సీఎంఆర్‌ఎఫ్ సాయం

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేదల వైద్యానికి ప్రభు త్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 749 మందికి రూ.5.59 కోట్ల మొత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందినట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. నియోజకవర్గానికి చెందిన 67 మందికి రూ.53.24 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. సీఎం చంద్రబాబుకు బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

జనసేన కార్పొరేటర్ చాయాదేవి చొరవతో..

మచిలీపట్నం టౌన్ : పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జనసేన కార్పొరేటర్ పినిశెట్టి చాయాదేవి అన్నారు. నాల్గో డివిజన్‌లో ఎస్.శ్రీనివాసరావు భార్య సావిత్రి ఇటీవల కేన్సర్ వ్యాధి తో మృతి చెందగా, మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో సీఎం సాయం మంజూరు అయింది. రూ.46 వేల చెక్కును ఆదివారం కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయాదేవి, వార్డు టీడీపీ ఇన్‌చార్జి కరెడ్ల సుశీల, స్టేట్ మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీంబేగ్, నాయకు లు పినిశెట్టి వేణు అందజేశారు. శ్రీనివాసరావును ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర ముందుకు రావడం ముదావహమన్నారు.

మరోమారు వంచనకు వైసీపీ : కొల్లూరి ధ్వజం

అవనిగడ్డ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోటి సంతకాల పేరుతో వైసీపీ మరోమారు ప్రజలను వంచించేందుకు బయలుదేరిందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. దాచుకోవటం, దోచుకోవటం తప్ప ఏమీ ఎరగని జగన్మోహన్‌రెడ్డి ప్రజలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని కొల్లూరి వెంకటేశ్వరరావు ఆరోపించారు. బండే శ్రీనివాసరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మేడికొండ విజయ్, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575



కొండాలమ్మకు ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తులు సాధారణ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. 8000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకొన్నారని ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. కాగా కొండలమ్మ అమ్మవారి దేవస్థాన 17వ వార్షికోత్సవం మంగళవారం 28వ తేదీ నిర్వహించనున్నామని కొండలరావు తెలిపారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్పార్చన నిర్వహిస్తామని ఆయన తెలిపారు. భక్తులు పాల్గొనాలని చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు విజ్ఞప్తి చేశారు.



కొండాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : వాతావరణ శాఖ జిల్లాలో మొంథా తుఫాన్ వేళ హైఅలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గ అధికార యంతాంగ్రం అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య తలెత్తిన ఫోన్‌కాల్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. ఆమెరికా పర్యటనలో ఉండటంతో ఆదివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. పట్టణంలోని రహదారులపై నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయినేజీల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో నీట మునగకుండా వర్షపు నీరు బయటకు ప్రవహించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టణం గుండా ప్రవహిస్తున్న చంద్రయ్య డ్రెయిన్ అవుట్ ఫ్లో ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. బుడమేరు వంతెన, పరివాహక ప్రాంతాల వద్ద వరద నీరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే వెనిగండ్ల స్పష్టం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

సత్యదేవుని ఆలయం వద్ద మాసం దుకాణం వద్దు

గుడ్లవల్లేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంత బజారులో సత్యనారాయణ స్వామి ఆలయానికి కూతవేటు దూరంలో మాంసం దుకాణాన్ని ఏర్పాటు చేయడం పట్ల చుట్టుపక్కల ప్రజలు అభ్యంతరం తెలుపుతున్నారు. నివాస ప్రాంతంలో అనుమతులు లేకుండా కోడిమాసం విక్రయ దుకాణం ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బందికరంగా ఉందని ఆప్రాంత ప్రజలు పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో ఇమ్రాన్‌కు పిర్యాదు చేశారు. నివాస ప్రాంతంలో మాంసం దుకాణానికి అనుమతులు ఇవ్వడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినవారిలో సాయిన వెంకటేశ్వరరావు(నాని), ఎ.సూర్యప్రకాశరావు, పోతురాజు, కుమార్, రంగా, నరేంద్ర తదితరులు ఉన్నారు. కాగా ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి నరసింహారావు వెంటనే పరిశీలించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



జనసేనలో చేరిన కార్యకర్తలు

జనసేనలో పలువురి చేరిక

గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని, పార్టీని బలోపేతం చేసే దిశగా పని చేస్తున్నామని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు వేమూరి త్రినాథ్ చొరవతో 31వ వార్డుకు చెందిన అమనపు అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో 30మంది యువకులు జనసేనలో చేరారు. జనసేన పట్టణాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు సాయన రాజేష్, పడాల పూర్ణ, ఇమ్మిడిశెట్టి భాను, యక్కల శ్రీనివాసరావు, షరీఫ్, సాయికృష్ణ, కిరణ్, వెంకట్ పాల్గొన్నారు.

కార్తీకమాస పూజలు

పెదపారుపూడి : వెంట్రప్రగడలోని కోదండ రామాలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు నిర్వహించారు. కటారి శివకుమార్ - సునీత దంపతులు పూజలు చేశారు. వీరి ఆధ్వర్యంలో సుమారు 1500 మందికి అన్నసమారాధన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బయ్య, సత్యనారాయణ, రవికుమార్, విజయబాబు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా నవంబరు 1న

పామర్రు : నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కురుమద్దాలిలో ఈనెల 29న నిరుద్యోగులకు నిర్వహించాల్సిన జాబ్‌మేళాను తుఫాన్ దృష్ట్యా నవంబరు ఒకటోతేదికి వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆదివారం తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపూడిలో తాతా వెంకటస్వామి జ్ఞాపకార్థం తాతా రాంబాబు, రజనీ దంపతులు ఉచితంగా అందించిన స్థలంలో నిర్మించిన సచివాలయ, రైతు సేవా కేంద్రాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ, రైతు సేవా కేంద్రాల ద్వారా అధికారులు, సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం లేకుండా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని భీమనది డ్రెయిన్‌లో గుర్రపు డెక్కను వెంటనే తొలగించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలను అప్రమత్తం చేసి ఏలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మొవ్వ తహసీల్దార్ కె.మస్తాన్, గ్రామసర్పంచ్ తాతా రజని, ఎంపీటీసీ కందుల కోటేశ్వరరావు, ప్రభాకర్ రావు, రామిశెట్టి రాజు, వీరంకి తులసీ దాస్,దుర్గా ప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు, శీలం బాబురావు పాల్గొన్నారు.



సచివాలయ, రైతు సేవా కేంద్రాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు

● తహసీల్దార్ ఎం కుసుమ కుమారి

తోట్లవల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : లంకల్లో పూరిళ్లు కలిగిన ప్రజలను, చెరువు కట్టలపై నివసిసంచే ప్రజల కోసం పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, సోమవారం సాయంత్రానికి ప్రజలను తరలిస్తామని తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం అధికారులతో సమావేశమయ్యారు. రొయ్యూరు శివారు కళింగ దిబ్బలంక ప్రజలను వల్లూరుపాలెం పాఠశాలకు, తుమ్మల పచ్చికలంక ప్రజలను పాములలంకలో చర్చిలోకి, గరికపర్రు చెరువు కట్టపై నవసిస్తున్న ప్రజలను, కుమ్మమూరులో కనకవల్లి డ్రెయిన్ కట్టపై నివసిస్తున్న ప్రజలను ఆయా గ్రామాల్లోని పాఠశాలలకు, దేవరపల్లి శివారు తోడేళ్లదిబ్బలంక ప్రజలను దేవరపల్లి పాఠశాలకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. సోమవారం సాయంత్రానికి ఆయా పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలిస్తామని పేర్కొన్నారు. తుఫానుపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండలంలోని అన్ని గ్రామాల్లో మైక్ ప్రచారం నిర్వహించామన్నారు. తుఫాను సహాయ చర్యలను పర్యవేక్షించేందుకు కలెక్టర్ స్పెషలాఫీసర్‌ను సైతం నియమించారన్నారు. ఎంపీడీవో రవికాంత్, డీఎల్‌డీవో రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.



తుఫాను ముందస్తు జాగ్రత్తలపై సమావేశమైన అధికారులు

పోటీ పరీక్షల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇటీవల మ్యాథమేటిక్స్ టీచర్స్ అసోసియేషన్(ఇండియా) నిర్వహించిన ఒలింపియాడ్ క్వాలిఫై ఇన్ మ్యాథమేటిక్స్ పోటీ పరీక్షల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు 17మంది అత్యంత ప్రతిభ కనబరచి సెకండ్ లెవల్ ఆర్‌ఎంవోకు అర్హత సాధించినట్లు ఫ్యాక్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి తెలిపారు. పాఠశాల విద్యార్థులు డి.కీర్తనరెడ్డి, ఎం.నీరజ్‌కుమార్, డి.వ్యాగ్రీష్ చౌదరి, వి.హేమసాయి సిద్ధార్థ్, బి.గురుదీపక్‌రెడ్డి, షేక్ సాజిద్ రిహన్, ఎ.కార్తీక్‌రెడ్డి, డి.రిషితరెడ్డి, కె.నిహాల్ రెడ్డి, జి.జయ అభిరామ్, కె.ప్రేమ్‌చంద్, ఎం.వి భవ్య తేజ, పి.మోహిత్ వెంకట సుభాష్, పి.ప్రణీత్‌రెడ్డి, డి.తేజిత్‌నాయుడు, వి.ఆనంద్‌కాశీ వైష్ణవ్‌రెడ్డి, జి.రెడ్డి పునీత్ యాదవ్‌లు నవంబరు 16వ తేదీన జరిగే సెకండ్ లెవల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి

ఆరోగ్య రక్షణపై అవగాహన తప్పనిసరి

గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) :ప్రజల ఆరోగ్య రక్షణలో అవగాహన అత్యంత కీలకమని, సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని రమేష్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుడివాడలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద వాక్‌థాన్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ ప్రారంభించి సహా సైక్లిస్టులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రోక్ లేదా గుండె సమస్యల లక్షణాలను గుర్తించి, వెంటనే వైద్యసహాయం పొందడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చునన్నారు.అనంతరం సీపీఆర్ శిక్షణ, ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ శిబిరంలో 200మంది ప్రజలు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

వెరికోస్ వ్యాధిపై అవగాహన అవసరం

పామర్రు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వెరికోస్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే నివారణ చాలా సులభతరమవుతుందని హైదరబాద్‌కు చెందిన ప్రముఖ అవిస్ ఆసుపత్రి వెరికోస్ వైద్యనిపుణులు డాక్టర్ అన్వర్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో పామర్రు లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వెరికోస్ నివారణ పట్ల ప్రజలకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. 89మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవులూరి వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ డాక్టర్లు జియా, బీవీ అప్పారావు, విక్టర్‌పాల్, లయన్స్‌క్లబ్ ప్రముఖులు పెరుమాళ్ల రాధాకృష్ణ, బైసాని నాగేశ్వరరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్, తోట రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అన్వర్

ఉపాధ్యాయులకు అబ్దుల్ కలామ్ అవార్డులు



విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న ఎస్‌పీఎల్‌టీవో

గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : దక్షిణాది రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభావంతమైన నిష్ణాతులైన వారికి సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన పురస్కార ప్రధానోత్సవంలో స్థానిక విద్యాలయ పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం-2025 అందుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.ఎస్ నారాయణ, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, షేక్ వహీద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

నందివాడ: దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతమైన వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ అసోసియేషన్ వారు అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని ప్రదానం చేసే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి ప్రతిభా పురస్కారం జనార్ధనపురం శుభోదయ స్కూల్ కరస్పాండెంట్ సజ్జా అనిల్ కుమార్‌కు 2025 ఆదివారం ఆ సంఘ అధ్యక్షుడు గుంటూరు, కృష్ణా జిల్లాల మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నాలు వారి ఆధ్వర్యంలో గుంటూరులో అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారం అవార్డు అందించినట్లు అనిల్ కుమార్ తెలిపారు. గ్రామస్థులు అనిల్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న అనీల్ కుమార్



కొమ్మినేనిను సత్కరిస్తున్న ఎస్‌పీఎల్‌టీవో

ఆర్థిక సాయం


గుడివాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సంస్థ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ రోగికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం స్థానిక మానవతా సంస్థ కార్యాలయంలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కృషిచేసిన రైల్వే ఎంప్లాయీస్ సంఘం గుడివాడ బ్రాంచ్ కార్యదర్శి పనిచేస్తున్న చుక్కా శివశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంధ సంస్థ శాఖ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కార్యదర్శి నందమూరి పద్మజ, కోశాధికారి బచ్చు రాధాకృష్ణ, చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, పర్యావరణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మీ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

పెదపారుపూడి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడ గ్రామం నుంచి వింజనంపాడు వరకు జిల్లా పరిషత్ రోడ్డు వర్షానికి గుంటలు పడి వింజనంపాడు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో వెంట్రప్రగడ నుంచి వింజనంపాడు జిల్లా పరిషత్ రోడ్డును మరమ్మతులు చేస్తున్నట్లు రమేష్ చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య, టీడీపీ నాయకులు పొనుగోటి సత్యనారాయణ, గొరిపర్తి రవికుమార్, మాయర విజయబాబు, వెలగపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



గుర్రపు డెక్క తొలగింపునకు మందు పిచికారి చేస్తున్న కూలీలు

పాలకోడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు

పెదపారుపూడి : పాలకోడు డ్రెయిన్‌లో గుర్రపు డెక్కతో ఉండటంతో నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంలో అధికారులు స్పందించారు. వెంట్రప్రగడ, వానపాముల, జమిదింటకుర్రు, అప్పికట్ల, జువ్వలపూడి, పెదపారుపూడి దగ్గర గ్రామాల్లో పొలాలు సరిగా నీరు పోకుండా గుర్రపు డెక్క అల్లుకుపోవటంతో అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగింపునకు మందు పిచికారి చేస్తున్నట్లు డ్రెయినేజీ ఏఈ అనిల్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



గుడ్లవల్లేరులో..

పామర్రు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథాతుఫాన్ తీవ్రతను గుర్తించి ముందుస్తుగా ప్రభుత్వం అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈతుఫాన్ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కోరారు. తుఫాన్‌పై ఆదివారం గన్నవరం నుంచి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్ని అప్రమత్తుల్ని చేయడంలో నియోజకవర్గంలో ఏ అధికారి నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. లోతట్టుప్రాంతాల ప్రజల్ని సురక్ష ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

పామర్రు: మొంథాతుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జె.అరుణ సూచించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యదర్శులతో ఆమె మాట్లాడుతూ రాబోయే మూడురోజుల్లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, గ్రామాల్లోని పల్లెలో మట్టిమిద్దెలు, కల్వర్టులు, పూరిగుడిసెలు, రోడ్డుపక్కన గుడారాలు వేసుకుని నివాసించే వారిని అప్రమత్తుల్ని చేయాలన్నారు. గ్రామసచివాలయాల్లో కార్యదర్శులు, ఇతర శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అవసరమైన సహయక చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని సూచించారు. ఈ తుఫాన్ ప్రభావంతో వ్యాధులుసోకే ప్రమాదంఉందని ప్రజలు గమనించి కాచీ చల్లార్చిన నీటి సేవించాలన్నారు.

గుడ్లవల్లేరు : ముంచుకొస్తున్న మొంథా తుఫాను దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తతో ఉండాలని గుడ్లవల్లేరు ఎస్సై ఎస్.వి.వి. సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి గుడ్లవల్లేరు ప్రధాన కూడలిలో ప్రజలకు తుఫాను తీవ్రతపై విషయాలను అవగాహనపరిచారు. ఈనెల 27,28,29 తేదీలలో తుఫాను హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎవ్వరూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటికి రావద్దని ఆయన హెచ్చరించారు. ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.

గుడివాడ రూరల్ : మొంథా తుఫాను సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ అన్నారు. ఆదివారం మోటూరులో వివిధ శాఖల అధికారుల సహాయంతో మోటూరులోని పాఠశాల భవనాలు పరిశీలించారు.మూడురోజుల పాటు ఉద్యోగులు ఆయా గ్రామాల్లో ఉండాలని తెలిపారు. ఎస్సై చంటిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : వరి కోతలను ఒక వారం రోజులు వాయిదా వేసుకోవాలని ఏడీఏ ఎస్.కవిత ఆదివారం కార్యాలయంలో రైతులను కోరారు. తుఫాన్ నేపథ్యంలో వరి కోత కోసినా తుఫాన్ కారణంగా నష్టం జరుగుతుందని తెలిపారు. గుడివాడ, పెదపారుపూడి మండలాల్లో వరి కోతకు వచ్చాయని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


నందివాడ: మొంథా తుపాను ప్రభావం వల్ల మూడు రోజులలో గ్రామాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. తుపాను ప్రభావం తీవ్రత కారణంగా అధికారులు ప్రజలకు షెల్టర్లు గ్రామాల్లో ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.



మోటూరులో ..

గుడివాడ మండల ప్రత్యేకాధికారిగా ఎస్ సరళ

గుడివాడ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండల మొంథా తుపాను సందర్భంగా గుడివాడ మండల ప్రత్యేకాధికారిగా జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అధికారిణి ఎస్.సరళ కుమారిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుడివాడలోని పునరావాస కేంద్రాలు, తుపాను ఏ విధంగా వస్తుంది తదితర అంశాలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో తదితర అధికారులు బృందంగా ఏర్పడి ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో తుపానుకు సంబంధించిన విషయాలన్నింటిని పరిశీలిస్తారు. లోతట్టు ప్రాంతాల వారికి పునరావాసం కల్పించనున్నారు.



నందివాడలో..